నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

అత్యవసరమైతేనే బయటకు రండి : తెలంగాణ పోలీసు శాఖ

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసు శాఖ కోరింది. అత్యవసరమైతేనే బయటకు రావాలని విజ్ఞప్తి చేసింది. వరద ఉధృతి ఉన్న ప్రాంతాల్లో నీటిగుండా దాటే ప్రయత్నం చేయొద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలని తెలంగాణ పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

హైదరాబాద్ మంగళవారం 28-9-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక:55 పేజీలు: 4 వెల: రూ.1/-

ప్రతి భారతీయుడికి డిజిటల్ హెల్త్ ఐడీ : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను ఇవాళ ప్రధాని మోదీ ప్రారంభించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య చికిత్సను అందించడంలో ఎదురయ్యే సమస్యను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పరిష్కరిస్తుందని ఆయన అన్నారు. ఈ స్కీమ్ కింద ప్రతి భారతీయుడికి డిజిటల్ హెల్త్ ఐడీని ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక పౌరుడి హెల్త్ రికార్డు డిజిటల్ పద్ధతిలో సురక్షితంగా ఉంటుందన్నారు. డిజిటలైజేషన్ వల్ల ఆరోగ్య నియంత్రణ మరింత సులభం అవుతుందని ప్రధాని అన్నారు. టెక్నాలజీ ఆధారంగా.. ఆయుష్మాన్ భారత్ రోగుల సేవల గురించి దేశవ్యాప్తగా అన్ని హాస్పిటళ్లకు విస్తరిస్తుందన్నారు. సాంకేతికంగా బలమైన ప్లాట్‌ఫామ్‌తో సులభమైన వైద్య చికిత్స వీలవుతుందన్నారు. డిజిటల్ మౌళిక సదుపాయాలు ఇండియాలో భారీ స్థాయిలో ఉన్నాయని, దేశంలో యూపీఐ విధానంలో అన్ని పనులు జరుగుతున్నాయని, 118 మంది మొబైల్ వినియోగదారులు ఉన్నారని, 80 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారని, 43 కోట్ల మందికి జన్‌ధన్ అకౌంట్లు ఉన్నాయని, ఇలాంటి భారీ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏ దేశంలోనూ లేదని మోదీ అన్నారు.

ఉచిత వ్యాక్సిన్ ఉద్యమం ద్వారా దేశవ్యాప్తంగా 90 కోట్ల వ్యాక్సిన్ డోసులను ఇచ్చామని, దీంతో ఓ రికార్డును క్రియేట్ చేశామన్నారు. టీకాలు తీసుకున్నవారందరికీ సర్టిఫికేట్లు ఇచ్చామని, ఈ ఘనతలో కోవిన్ పోర్టల్ పాత్ర కీలకమైందని మోదీ ప్రశంసించారు. భారతీయ వైద్య ఆరోగ్య రంగంలో కల్పించే సదుపాయాల అంశంలో ఆయుష్మాన్ డిజిటల్ మిషన్ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని మోదీ అన్నారు. మూడేళ్ల క్రితం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభిచామని, ఇప్పుడు డిజిటల్ మిషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రధాని తెలిపారు. ఇవాళ వరల్డ్ టూరిజం డే అని, ఎక్కువ మంది వ్యాక్సిన్ తీసుకుంటే, అప్పుడు టూరిస్టులు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తారన్నారు. అందుకే హిమాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవుల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు.

డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బందికి మోదీ థ్యాంక్స్ చెప్పారు. వ్యాక్సినేషనైనా లేక కోవిడ్ చికిత్స అయినా, వైద్య సిబ్బంది సహాయం వల్లే కరోనా పోరాటంలో భారీ ఊరట దక్కిందన్నారు.

తెలంగాణలో భారీ వర్షాలు.. హైదరాబాద్‌లో హై అలర్ట్

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:బంగాళాఖాతంలో ఏర్పడిన 'గులాబ్' తుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్ వ్యాప్తంగా వర్షం కురుస్తున్నది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడుతున్నది. జీడిమెట్ల, కొంపల్లి, కుత్బుల్లాపూర్, అంబర్‌పేట, కాచిగూడ, గోల్కొండ, నల్లకుంటలో ఉరుములతో కూడిన వర్షం కురుస్తున్నది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. నేడు, రేపు జీహెచ్ఎంసీ హైఅలర్ట్ ప్రకటించింది. గులాబ్ తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో సోమవారం, మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండేలా అధికారుల చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. తుఫాన్ నేపథ్యంలో హైదరాబాద్‌లో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తుపాను నేపథ్యంలో రైల్వేశాఖ పలు రైళ్లను రద్దు చేసింది. మరికొన్నింటిని దారిమళ్లించింది.

భారీ వర్షాలపై సీఎం కేసీఆర్ సమీక్ష.. అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డితో ఢిల్లీ నుంచి సీఎం కేసీఆర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గులాబ్ తుఫాను ప్రభావంతో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని కేసీఆర్ సూచించారు.

ప్రతీ జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సీఎస్ సోమేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే హైదరాబాద్, కొత్తగూడెం, వరంగల్ జిల్లాల్లో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, బ్రిడ్జిల వద్ద ప్రత్యేకంగా అధికారులను నియమించి పరిస్థితులను పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు.

డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్లతో సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించామని తెలిపారు. ఈ మేరకు పోలీస్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించామని చెప్పారు.

ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్, డీజీపీతో పాటు రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ సునీల్ శర్మ, పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కూడా పాల్గొన్నారు

వచ్చే ఏడాది నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉర్దూ మీడియంలో బోధన

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:వచ్చే ఏడాది నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉర్దూ మీడియంలో బోధన చేయనున్నామని గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ప్రస్తుతం ఉర్దూ మీడియం బోధించే అంగన్‌వాడీ టీచర్లు 412 మంది ఉన్నారన్నారు. ముస్లిం ప్రాంతాల్లో ఉర్దూలో, గిరిజన ప్రాంతాల్లో లంబాడా, కోయ వంటి స్థానిక భాషల్లో బోధన చేస్తున్నాం అని తెలిపారు.

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి?, వాటి పెంపు ప్రతిపాదన?, వాటిలో బోధనా మాధ్యమంగా ఉర్దూ భాష అమలు చేసే విషయం పరిశీలనలో ఉందా? మినీ అంగన్‌వాడీలకు అంగన్‌వాడీ టీచర్లకు సమానంగా వేతనాల పెంపుపై శాసనమండలిలో గౌరవ సభ్యులు కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, కూర రఘోత్తం రెడ్డి, కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు.

రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, అయితే

జనాభా పెరిగిందని, పెరిగిన జనాభాకు అనుగుణంగా 870 అంగన్‌వాడీ కేంద్రాలు పెంపు కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సిబ్బంది నియామకానికి విద్యార్హతలలో ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో అక్కడి స్థానికులతో భర్తీ కోసం అనేక వెసులుబాటులు కల్పించామని పేర్కొన్నారు.

హైదరాబాద్ లో ఎక్కువ కేంద్రాలకు ప్రతి పాదనలు పంపామని చెప్పారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలు అంటే పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు మందులు ఇచ్చేవిగా ఉండేవి. కానీ సీఎం కేసీఆర్ వచ్చాక వాటితో పాటు విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చెందాయన్నారు.

అంగన్వాడి కేంద్రాలకు వచ్చే 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ప్రీ ? ప్రైమరీ స్కూల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే పుస్తకాలు కూడా

అందించామన్నారు. ఆయా ప్రాంతాల్లోని స్థానిక భాషలోనే బోధన చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం.మినీ అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

సీఎం కేసీఆర్ ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మూడుసార్లు వేతనాలు పెంచారని చెప్పారు. ఇప్పుడు అంగన్‌వాడీ లకు రూ.13,650 వేతనం వస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ ఖాళీల భర్తీ కోసం కూడా ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు.

శంషాబాద్ విమానాశ్రయంలో బంగారం పట్టివేత

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని అధికారులు పట్టుకున్నారు. రియాద్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికి వద్ద నుంచి రూ.34.24లక్షల విలువైన 763.66 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. చాక్లెట్ డబ్బాలో పెట్టుకొని అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ క్రమంలో తనిఖీలు నిర్వహించగా.. బంగారం దొరికింది. దీంతో బంగారాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బంగారాన్ని ఎక్కడికి తరలిస్తున్నాడనే కోణంలో విచారిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా భారత్ బంద్.. రోడ్లపైకి వచ్చిన విపక్షాలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:దేశ వ్యాప్తంగా భారత్ బంద్ కొనసాగుతోంది. కేంద్రం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతుసంఘాలు.. నేడు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ బంద్ కొనసాగనుంది. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా, కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సంయుక్త కిసాన్‌మోర్చా తలపెట్టిన భారత్ బంద్‌కు ఏపీలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఏపీలో బీజేపీ జనసేన మినహా అన్ని పార్టీలు బంద్ కు మద్దతు ప్రకటించాయి. ఏపీ ప్రభుత్వం సైతం బంద్ కు సంఘీభావం తెలిపింది. అందులో భాగంగా మధ్యాహ్నం వరకు బస్సులను నిలిపివేస్తూ నిర్ణయించింది. మధ్యాహ్నం ఒంటి గంట తరువాత తిరిగి బస్సులు ప్రారంభం కానున్నాయి. కాంగ్రెస్ తో పాటుగా టీడీపీ వామపక్ష పార్టీలు బంద్ లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయి.

ఇటు తెలంగాణలోనూ బంద్ కొనసాగుతోంది. మహబూబ్నగర్ నల్గొండ ఖమ్మం జిల్లాల్లో కాంగ్రెస్ వామపక్ష పార్టీలు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో 3 జనపనార మిల్లులు ఏర్పాటు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్రంలో జనపనార మిల్లును ఏర్పాటు చేసేందుకు మూడు కంపెనీలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జనపనార పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ఆయా కంపెనీలకు ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పిస్తున్నది. రెండు వరి పంటల మధ్యన మూడో పంటగా జనుము పంటను పండిచేందుకు తెలంగాణ ప్రభుత్వం వీలు కల్పిస్తుందని తెలిపారు.

శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా జనపనార మిల్లుల ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు.

వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే అగ్రభాగాన ఉన్నాం. రైతులకు ఇబ్బంది కావొద్దనే ఉద్దేశంతోనే గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం సేకరించాం. కానీ సరిపడ గోనె సంచులు లేక ఇబ్బంది పడ్డాం. బెంగాల్, బంగ్లాదేశ్‌లో జ్యూట్ మిల్స్ మూతపడ్డాయి. గొనే సంచులకు విపరీతమైన కొరత వచ్చింది. ఆ సమయంలో తమను సీఎం కేసీఆర్ పిలిచి.. మన రాష్ట్రంలోనే గోనె సంచులను ఉత్పత్తి చేసే దిశగా ఆలోచించాలన్నారు.

రాయితీలు ఇచ్చి పెట్టుబడులను ఆహ్వానించాలన్నారు. వరంగల్ జిల్లాలో గ్లాస్టర్ లిమిటెడ్ అనే కంపెనీ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంబీజీ కమాటెడిస్ అనే కంపెనీ, కామారెడ్డి జిల్లాలో కాళేశ్వరం అగ్రో కంపెనీ జనపనార మిల్లులను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మూడు కంపెనీలు కలిపి రూ. 887 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయి. 10,480 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

రైతులు ఉత్పత్తి చేసిన జనుమును ఈ పరిశ్రమలు కొని, వారు ఉత్పత్తి చేసిన గోనే సంచులను ప్రభుత్వం కొనేందుకు ఒక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. మొదటి 7 సంవత్సరాల పాటు వారు ఉత్పత్తి చేసే గోనే సంచులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. 15 కోట్ల గోనే సంచులను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. మన రాష్ట్రంలో 27 కోట్ల డిమాండ్ ఉంది. జనుము మన దగ్గర పండటం లేదు. బీహార్, బంగ్లాదేశ్ నుంచి జనుమును దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జనుము రవాణాపై సబ్సిడీ కూడా ఇస్తున్నామని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా జనుము పంటను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నాం. రైతులకు దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. జ్యూట్ మిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ తొలి ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తొలి, మలిదశ తెలంగాణ పోరాటంలో బాపూజీ సేవలను గుర్తు చేసుకున్నారు. సబ్బండవర్గాల సంక్షేమం కోసం ఆయన జీవితాంతం పోరాడిని తీరు ప్రశంసనీయమన్నారు.

గొర్రెల పంపిణీతో రూ. 10 కోట్ల సంపదను సృష్టించాం : మంత్రి తలసాని

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:రాష్ట్రంలో గొర్రెల పంపిణీతో రూ. 10 కోట్ల సంపదను సృష్టించామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా గొర్రెల పంపిణీపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తలసాని సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలో మొదటి దశలో 3, 80,878 గొర్రెల యూనిట్లను పంపిణీ చేశాం. రెండో దశలో 3 లక్షల 50వేల గొర్రెల యూనిట్లను ఇవ్వడానికి సీఎం ఆదేశాలు జారీ చేశారు. దీని నిమిత్తం రూ. 4,780 కోట్ల 44 వేల రూపాయాలు ఖర్చు చేశాం. ప్రస్తుతం రాష్ట్రంలో 191 లక్షల గొర్రెలు ఉన్నాయన్నారు. కులవృత్తులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఉమ్మడి ఏపీలో కులవృత్తులను ఎవరూ పట్టించుకోలేదు.

బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ కొత్త కార్యక్రమాలు చేపట్టారు. గొర్రెల పంపిణీతో పాటు వాటికి ఇన్సూరెన్స్ కూడా కల్పించాం. గొల్లకురుమలు ఆర్థికంగా ఎదిగారు. రూ. 10 కోట్ల సంపదను సృష్టించారు. మనం గొర్రెలను పంపిణీ చేసిన తర్వాత ఒక కోటి 30 లక్షల గొర్రె పిల్లలు వచ్చాయి. మూగజీవాలకు మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. గొర్రెల ఉత్పత్తిలో తెలంగాణ ఇండియాలోనే ప్రథమస్థానంలో ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

ప్రతి పరిశ్రమకు గమ్యస్థానం తెలంగాణే : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో పురోగమిస్తుందని, ప్రతి పరిశ్రమకు గమ్యస్థానం తెలంగాణే అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ రంగాల ప్రగతిపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు. సభ్యులు మాట్లాడిన అనంతరం కేటీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

తెలంగాణ యొక్క పారిశ్రామిక పురోగతి రెండు మాటల్లో చెప్పాలంటే.. ట్రాక్టర్ నుంచి హెలికాప్టర్ దాకా, ఎర్రబస్సు నుంచి ఎలక్ట్రిక్ బస్సు దాకా, ఎలక్ట్రిక్ బస్సు నుంచి ఎయిర్ బస్ దాకా, టైల్స్ నుంచి టెక్స్‌టైల్స్ దాకా, యాప్స్ నుంచి యాపిల్ మ్యాప్ దాకా, ప్రతి పరిశ్రమకు గమ్యస్థానం తెలంగాణే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఈ మాట తాను అనాలోచితంగా చెప్పడం లేదు. ఇది జరుగుతున్న చరిత్ర. నడుస్తున్న చరిత్ర ఇది అని స్పష్టం చేశారు. కేసీఆర్ కార్యదక్షతకు ఇది నిదర్శనం. సమర్థమైన నాయకత్వం, సుస్థిరమైన ప్రభుత్వం ఉన్నప్పుడు పెట్టుబడులు వెల్లువలా వస్తాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి రంగంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతోంది.

తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రభాగాన ఉంది. తెలంగాణ రాష్ట్రం 14 ప్రాధాన్యత రంగాలను ఎంచుకుంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి రంగాలను ఎంచుకున్నాం అని కేటీఆర్ తెలిపారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌గా ముచ్చర్ల అవతరించబోతోంది అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. పరిశ్రమలు ఒకే చోట ఉంటే ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 23 వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తే.. టీఎస్ఐఐసీ ఏర్పాటయ్యాక ఆరేండ్లలో 19 వేలకు పైగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని ప్రాంతాల్లో సమ్మిళిత అభివృద్ధి జరగాలి. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ విస్తరిస్తాం. ద్వితీయ శ్రేణి పట్టణాల్లో 50 వేల ఉద్యోగాల సృష్టే లక్ష్యమన్నారు. ప్రతి పరిశ్రమకు తెలంగాణే గమ్యస్థానం. సీఎం దృష్టికోణం ఎప్పుడూ దూరదృష్టితో ఉంటుంది అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ విజయాలను దేశం గుర్తించింది : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:తెలంగాణ విజయాలను దేశం గుర్తించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శాసనమండలిలో దేశంలో తెలంగాణ రాష్ట్రం వరి ఉత్పత్తి, విస్తీర్ణం, సదరు ఉత్పత్తికి వినియోగించిన నీరు, వరి ధాన్యం ఉత్పత్తి విలువపై శాసనమండలి సభ్యుడు తేరా చిన్నపరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధామిచ్చారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ అనుకూల విధానాలతో తెలంగాణ రైతు తల ఎత్తుకుని తిరుగుతున్నాడు. సాగు నీటి రాక, వ్యవసాయ పథకాలతో సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తులు పెరిగాయన్నారు. దేశంలో ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది.

గత ఏడాది వానాకాలం, యాసంగిలో కలిపి రూ.41 వేల 240 కోట్ల విలువైన వరి ధాన్యం ఉత్పత్తి అయిందని మంత్రి తెలిపారు. ప్రతిపక్షాలు, కొందరు నేతలు అవగాహన లేక ప్రాజెక్టులు, పంటల మీద విమర్శలు చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక ప్రాజెక్టులు నిర్మించామన్నారు. ఏ ప్రాజెక్టు కట్టినా సాగునీటి కల్పనతో పాటు భూగర్భజలాలు, మత్స్య సంపద పెరుగుతాయి.

ఆరుతడి పంటలకు కూడా సాగునీరు అవసరం అన్నారు. ప్రాజెక్టు కడితే వరి పంట సాగుకే అనుకోవడం అవగాహనా రాహిత్యమన్నారు. మార్కెట్ రీసెర్చ్ అనాలసిస్ వింగ్‌తో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. కొందరు ధాన్యం ఎక్కువ ఎందుకు పండిస్తున్నారు అని ప్రశ్నించడం ఆశ్చర్యంగా ఉందన్నారు.రాజస్థాన్‌లో వరి పండించగలరా? కేరళ, తమిళనాడులలో డిమాండ్ కు తగ్గ వరి ధాన్యం దిగుబడి వస్తుందా ? ఇక్కడ పండిన పంట దేశంలోని అనేక రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి అవుతుందన్నారు. దేశంలో ఆహార ధాన్యాలను సమతుల్యం చేయాల్సిన బాధ్యత కేంద్రానిదన్నారు.తెలంగాణ రైతాంగానికి వేలు జరిగేలా సభలో సుదీర్ఘ చర్చ జరగాలి. నూనె, పప్పుగింజల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతువేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్యం చేస్తున్నామని వివరించారు. యాసంగిలో ఆరుతడి పంటలు సాగుచేయాలన్నారు. వేరుశెనగ పెద్ద ఎత్తున సాగు చేయాలని చెబుతున్నాం.తెలంగాణలో వండే ఆఫ్లాటాక్సిన్ రహిత వేరుశెనగకు అంతర్జాతీయ డిమాండ్ ఉందని మంత్రి తెలిపారు. గత ఏడాది 3.75 లక్షల ఎకరాలలో ఉన్న సాగును ఈ ఏడాది 5 లక్షల ఎకరాల పైకి తీసుకుపోవాలని కృషి చేస్తున్నామని మంత్రి విరించారు. కేంద్రం ధాన్యం కొనుగోలు చేసే అంశం మీద మరి కొద్ది రోజులలో స్పష్టత వస్తుందన్నారు.

పంజాబ్ లో వరిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది. అదేవిధంగా తెలంగాణ నుంచి కొనుగోలు చేయాలని కోరుతున్నాం.పంజాబ్ లో విస్తృతంగా వరి పండుతుంది .. ఆ తరువాత విస్తృతంగా వరి సాగయ్యేది తెలంగాణలోనే అని మంత్రి తెలిపారు. అందుకే పంజాబ్ మాదిరిగా పూర్తిస్థాయిలో ఇక్కడ కూడా వరి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.నియంత్రిత సాగు మీద కొందరు బురదజల్లి అక్కసు వెళ్లగక్కారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నేతలు పంటల మార్పిడికి రైతులను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు.

కొవిడ్ నిబంధనల ఉల్లంఘన : ఏఐఎంఐఎం చీఫ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

లక్నో, సెప్టెంబర్ 27: వచ్చే ఏడాది ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న యూపీలోని ప్రయాగరాజ్‌లో నిర్వహించిన ర్యాలీలో కొవిడ్-19 నిబంధనలు ఉల్లంఘించినందుకు ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కరోనా కట్టడి చర్యల్లో భాగంగా తాము ఓవైసీ ర్యాలీకి కేవలం వంద మంది పాల్గొనేందుకు అనుమతి ఇవ్వగా పెద్దసంఖ్యలో ప్రజలను అనుమతించారని, ఇది కొవిడ్-19 నిబంధనల ఉల్లంఘనేనని జిల్లా అధికార యంత్రాంగం పేర్కొంది. అసదుద్దీన్ ఓవైసీ శనివారం ప్రయాగరాజ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇక యూపీలో ఓవైసీ సభలకు సంబంధించి ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదవడం ఇది మూడవసారి. మరోవైపు ప్రయాగరాజ్ ర్యాలీలో జైలులో ఉన్న మాఫియా డాన్, మాజీ ఎంప అతిక్ అహ్మద్ భార్య పర్వీన్ పాల్గొన్నారు. రానున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఏఐఎంఐఎం టికెట్‌పై కాన్పూర్ నుంచి పోటీ చేస్తానని ఆమె సంకేతాలు పంపారు.

చరిత్రలో నేటినిజం



తరం॥ సప్తతి శతయంబు నెక్కుంగక
నిత్యకీ రూపమగు నలుచి నిష్ఠుగుడై
జుట్టి కొనకు బూనుదగ
పుట్టి మరణపెను భవుడు భగతుంగవుడున్!!

(సెప్టెంబర్ 28 భగత్‌సింగ్ జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210

కుక్క కాటుకు అవగాహనే చెప్పు దెబ్బ?!

(28 సెప్టెంబర్ 'ప్రపంచ రేబిస్ దినం' సందర్భంగా)

రేబిస్ వ్యాధిని నివారించడానికి అనగాహనలు కల్పించడంతో పాటు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలను సామాన్య జనానికి వివరించే లక్ష్యంగా 2007 నుంచి ప్రతి ఏట 28 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ రేబిస్ దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రథమ రేబిస్ టీకాను రూపొందించిన ప్రముఖ కెమిస్ట్, మైక్రోబయాలజిస్ట్ 'లూయస్ పాశ్చర్' వర్ధంతి సందర్భంగా 28 సెప్టెంబర్‌న 'ప్రపంచ రేబిస్ దినం' నిర్వహిస్తున్నాం. సురక్షిత జంతు మరియు మానవ టీకాలు అందుబాటులో ఉన్నందున రేబిస్‌ను నివారించుట చాలా తేలిక అని సభ్య సమాజానికి పిలుపు ఇవ్వడం జరుగుతోంది. 'ప్రపంచ రేబిస్ దినం-2021' నినాదంగా 'రేబిస్ : భయం వద్దు, వాస్తవాలే ముద్దు (రేబిస్ : ఫాక్ట్స్, నాట్ ఫియర్)' అనే అంశాన్ని తీసుకున్నారు. కోవిడ్-19 విపత్తుతో ప్రజల్లో వ్యాధుల వ్యాప్తి, టీకాల పట్ల అనుమానాలు పెరగడం, కొందరు కరోనా టీకా తీసుకోవడానికి కూడా అనవసరంగా భయపడడం చూస్తున్నాం. రేబిస్ వ్యాధి పట్ల ప్రజల్లో భయం, తప్పుడు సమాచారం, అవాస్తవ భ్రమలు, దురభిప్రాయాలు అనాదిగా నెలకొని ఉన్నాయి. వీటిని పక్కన పెట్టి రేబిస్ పట్ల వాస్తవ అవగాహన కల్పించి, జంతువులకు (ముఖ్యంగా కుక్కలకు) టీకాలు వేయించి, రేబిస్‌ను పూర్తిగా నివారించవచ్చని నమ్మకాన్ని కలిగించాలి. రేబిస్ వ్యాధి 99 శాతం ప్రాణాంతకమే అయినా 100 శాతం నివారించదగింది.

రేబిస్ పట్ల మనకున్న అవగాహనను సమాజంతో స్పష్టతతో పంచుకోవడం, అన్ని వీధి కుక్కలకు టీకాలు ఇప్పించడం, వీధి కుక్కల జనాభాను నియంత్రించడం, భయాన్ని వీడి రేబిస్‌ను నియంత్రించడం జరగాలి. ఐరాస లక్ష్యాల్లో 2030 నాటికి 'జీరో రేబిస్ మరణాల' స్థాయికి చేరాలని సూచించారు. గ్లోబల్ అలియాన్స్ ఫర్ రేబిస్ కంట్రోల్, డబ్ల్యూహెచ్‌ఓ, వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ ఆనిమల్ హెల్త్, యుయస్ సిడిసి సంస్థల సౌజన్యంతో ప్రపంచ రేబిస్ దినం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రేబిస్ వ్యాధితో ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 95 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ప్రజల్లో కనీస అవగాహన లేకపోవడంతో పేద దేశాలు రేబిస్ వలలో చిక్కడం కనిపిస్తున్నది. కుక్కలను ఇంటి ఆవరణలకే పరిమితం చేయడం, సాదు కుక్కలన్నింటికీ టీకా వాయించడం, వీధి కుక్కలకు విధిగా టీకా వేయించడం, వీధి శునకాల జనాభాను నియంత్రించడం, కుక్క కాటు వేసిన 15 నిమిషాల్లోపు నీటితో గాయాన్ని శుద్ధి చేయడం, వెంటనే ఆంటీ-రేబిస్ టీకాల పూర్తి డోసులను తీసుకోవడంతో రేబిస్ కారణ మరణాలను నివారించవచ్చు.

భారత్‌లో రేబిస్ స్థితి :

రేబిస్ వ్యాధి 150కి పైగా దేశాల్లో బయట పడుతున్నది. ప్రపంచ రేబిస్ కేసుల్లో 40 శాతం వరకు ఇండియాలోనే కనిపిస్తున్నాయి. రేబిస్ వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా 59,000 మంది, భారత్‌లో ప్రతి ఏట కనీసం 20,000 మరణిస్తున్నారు. రేబిస్‌తో మరణించే వారిలో 36-40 శాతం మంది 15 ఏండ్ల లోపువారు కావడం విచారకరం. కుక్క కాటు అతి ప్రమాదకరమని సామాన్యులకు తెలియక నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. అన్ని రకాల కుక్కలకు టీకా ఇప్పించడంతో పాటు కుక్క కరిచిన వ్యక్తి వెంటనే వైద్య సూచనలు పాటిస్తూ టీకాల పూర్తి డోసు తీసుకోవాలి. 100 శాతం నివారించగల రేబిస్ వ్యాధి మన నిర్లక్ష్యంతోనే ప్రాణాంతకంగా మారుతున్నదని తెలుసుకోవాలి. కుక్క కాటుతో మాత్రమే కాకుండా పిల్లులు, గబ్బిలాలు, ముంగిసల కాటు లేదా గీరడం వల్ల కూడా రేబిస్ వస్తుందని మరువరాదు. రేబిస్ వ్యాధి వల్ల జ్వరం, బలహీనత, తల నొప్పి, ఉద్రేకం, గందరగోళం, మస్తిష్క లోపం, నీటిని చూస్తే అతిగా (హైడ్రోఫోబియా) భయపడడం లాంటి వివిధ రోగ లక్షణాలు కనిపిస్తాయి. భారత్‌లో దాదాపు 40 మిలియన్ల వీధి కుక్కలు ఉండగా, వీటికి టీకా వేయించడం ప్రభుత్వ యంత్రాంగాలకు అతి సవాళుగా నిలుస్తున్నది. దక్షిణ భారతంలో వీధి కుక్కలను పట్టించి దూరంగా వదిలేయడం, విష ప్రయోగం చేయడం లాంటి చర్యలతో వాటి జనాభా పడిపోతున్నది. దేశంలో 70 శాతం మంది రేబిస్ పదాన్ని వినలేదని, 30 శాతం మందికి మాత్రమే కాటు వేసిన చోటును శుభ్రపరచడం గూర్చి తెలుసు అని నిర్ధారించారు. రేబిస్ పట్ల అవగాహన కల్పించే నిమిత్తం భారత ప్రభుత్వం 'జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమాన్ని' తీసుకువచ్చింది. దాదాపు 50 శాతం ప్రభుత్వ వైద్యశాలల్లో రేబిస్ టీకాలు నిలువ లేకపోవడం కూడా మరో సవాళుగా నిలుస్తున్నది. అత్యంత ప్రాణాంతక రేబిస్ పట్ల మౌళిక అవగాహనను కలిగి, రేబిస్ మరణాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం. కుక్క కాటుకు అవగాహనతో చెప్పు దెబ్బ కొడదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఎయిమ్స్ ఢిల్లీ వైద్యుల సామూహిక బదిలీలపై మీడియాలో వచ్చిన నివేదికలు నిజమైనవి కావు తప్పుదారి పట్టించేవి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:ఎయిమ్స్ 66 వ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రసంగిస్తూ కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవియా ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల సామూహిక బదిలీ ఉంటాయని ప్రకటన

చేసినట్లుగా కొన్ని మీడియాలలో అవాస్తవమైన వార్తలు వచ్చాయి. దేశ వ్యాప్తంగా అన్ని ఎయిమ్స్‌లో ఏక రీతి వైద్య ప్రమాణాలను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం త్వరలో బదిలీ విధానాన్ని అమలు చేయనున్నట్లు ఈ వార్తలు పేర్కొన్నాయి. ఈ విధానం ఎయిమ్స్ ఢిల్లీలోని డాక్టర్లను కొత్త ఎయిమ్స్‌కు బదిలీ చేయడానికి దారితీస్తుందని.. దీని వల్లఎయిమ్స్ ఢిల్లీకి కొత్త డాక్టర్ల నియామకానికి దారి తీస్తుందని ఈ మీడియా వార్తల్లో పేర్కొన్నారు. నిన్న ఎయిమ్స్ న్యూఢిల్లీ 66 వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం నుండి కేంద్ర ఆరోగ్య మంత్రిని ఉటంకిస్తూ వివిధ వార్తాపత్రికలు పేర్కొన్న ఇలాంటి ముఖ్య వార్తలు తప్పు మరియు తప్పుదోవ పట్టించేవి అని స్పష్టం చేయబడింది. కేంద్ర మంత్రి నిన్న అలాంటి ప్రకటనలేవీ చేయలేదు. ఈ తరహా వార్తలు పూర్తిగా అవాస్తవం, తప్పు సమాచారం , వాస్తవాలను స్పష్టంగా తప్పుగా నివేదించడమైంది. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఎయిమ్స్ నుండి ఉత్తీర్ణులైన విద్యార్థులు దేశ వ్యాప్తంగా నిర్మిస్తున్న కొత్త ఎయిమ్స్‌ను సుసంపన్నం చేస్తారని శ్రీ మాండవీయ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత అధ్యాపకులు తమ గొప్ప అనుభవంతో... ఈ సంస్థలకు మార్గదర్శక కాంతిగా పని చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి మాట్లాడిన ప్రసంగాన్ని ఇక్కడ క్లిక్ చేయడం ద్వారా వీక్షించవచ్చు:

ద్వారకా మహిళలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త

అమరావతి, సెప్టెంబర్ 27:ద్వారకా మహిళలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది. అక్టోబర్ 7 నుంచి విజయ దశమి కానుకగా రెండో విడత ఆసరా అందజేయనుంది.

రెండో విడత డబ్బుల పంపిణీ చేపట్టనుండటంతో విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సెర్ప్ సీఈవో ప్రకటించారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందే మహిళలు తమ జీవనోపాధులు పెంపొందించుకునేందుకు ముందుకొస్తే అదనంగా బ్యాంకు రుణాలు ఇప్పించేలా సెర్ప్ సిబ్బంది తోడ్పాటు అందిస్తారని వివరించారు.

ఈ పథకం ద్వారా ఏపీ వ్యాప్తంగా 87 లక్షల మంది పొదుపు సంఘాల మహిళలకు రూ. 6,470 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది. వాలంటీర్లు, వీవోఏ, ఆర్పీలు ఇప్పటిటికే తమ పరిధిలోని లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సమాచారం అందిస్తున్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ నెల 24న మొదలైన ఈ కార్యక్రమం ఈ నెల 28 వరకు కొనసాగుతుంది. ఇక అక్టోబర్ 7 నుంచి నిధులు విడుదల కానున్నాయి. ఈ పథకం ద్వారా ఏకంగా 80 లక్షల మందికి పైగా లబ్ది పొందనున్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజా చైతన్యమే కీలకం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్ తరాలకు జీవనానుకూల పరిస్థితులను కల్పించేందుకు వీలుంటుందని భారత గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఇంతటి విలువైన పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా ప్రజలను చైతన్య పరిచే విషయంలో ప్రభుత్వాలు చేస్తున్న కృషితోపాటు శాస్త్రవేత్తలు, పరిశోధకులు ముందుకు రావాలని ఆయన సూచించారు.

ఆదివారం సీఎస్ఐఆర్ (శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన మండలి) 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంతోపాటు పర్యావరణం, కాలుష్యం, వివిధ ఆరోగ్య సమస్యల పరిష్కారం తదితర అంశాల్లో సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తలు, ప్రయోగశాలలు పోషిస్తున్న పాత్రను అభినందించారు. ఈ దిశగా మరింత కృషి జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. శాస్త్రవేత్తలు ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ రంగం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి సరైన పరిష్కారాలు కనుగొనేదిశగా కృషిచేయాలన్న ఉపరాష్ట్రపతి, ఈ దిశగా యువ శాస్త్రవేత్తలు వినూత్నమైన ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు.

కరోనా ప్రపంచానికి కనిపించిన ఒక సమస్యేనన్న ఉపరాష్ట్రపతి, ఇలాంటి ఎన్నో నమస్యలు, నవాళ్లు నమాజం ముందున్నాయన్నారు. ప్రతి సీఎస్ఐఆర్ ప్రయోగశాల సరికొత్త పరిష్కారంతో ముందుకు రావాలని ఆయన సూచించారు. అంతరిక్షం, అణుశక్తి, సముద్ర విజ్ఞానం, రక్షణ పరిశోధన తదితర అంశాల్లో భారతదేశం ఎంతో ప్రగతిని సాధిస్తోందన్న ఆయన, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న ఈ సందర్భంలో ఆయా రంగాలతోపాటు విశ్వమానవాళికి మేలుచేసే మరిన్ని పరిశోధనలపై దృష్టిసారించడం ద్వారా ప్రపంచ పరిశోధనారంగంలో భారతదేశాన్ని మొదటిస్థానంలో నిలపాలన్నారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనడంలో సీఎస్ఐఆర్ సహా భారతీయ శాస్త్రవేత్తలు చూపిన చొరవ కారణంగానే భారతదేశం పెను ప్రభావం నుంచి బయటపడిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువ శాస్త్రవేత్తలు, సీఎస్ఐఆర్ ఇన్నోవేషన్ అవార్డ్స్ ఫర్ స్కూల్ చిల్డ్రన్ సహా వివిధ విభాగాల్లో అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో మహిళల సంఖ్య గణనీయంగా ఉండటాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మహిళలను ప్రోత్సహిస్తే పరిశోధన రంగంలో మరిన్ని అద్భుతాలు సృష్టించగలరని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. మానవాళి శ్రేయస్సు, సౌకర్యవంతమైన జీవితమే పరిశోధనల అంతిమ లక్ష్యం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన విజ్ఞాన సలహాదారు డాక్టర్ విజయ్ రాఘవన్, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ శేఖర్ మాండే, సీఎస్ఐఆర్ హెడ్ హెచ్ఆర్‌డీజీ డాక్టర్ అంజన్ రేతోపాటు శాస్త్రవేత్తలు, పరిశోధ కులు, విద్యార్థులు ప్రత్యక్షంగా, దేశవ్యా ప్తంగా ఉన్న వివిధ సీఎస్ఐఆర్ కేంద్రాలన ంచి అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులు నితీష్ గడ్కరీ, డాక్టర్ భారతీ పవార్ అధ్యక్షతన ఘనంగా జరిగిన నాగపూర్ ఎయిమ్స్ మూడవ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:నాగపూర్ ఎయిమ్స్ మూడవ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలు డిజిటల్ విధానంలో కేంద్ర రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితీష్ గడ్కరీ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ పవార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ వికాస్ మహాత్మే మహారాష్ట్ర ప్రభుత్వం ఇంధన మరియు సంరక్షణ మంత్రి (నాగపూర్) డాక్టర్ నితిన్ రౌత్ కూడా హాజరయ్యారు.

గత మూడు సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సౌకర్యాలను అందిస్తున్న నాగపూర్ ఎయిమ్స్ సిబ్బంది, విద్యార్థులను అభినందించిన శ్రీ గడ్కరీ విదర్భ ప్రాంత వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నాగపూర్ లో ఎయిమ్స్ ను నెలకొల్పిందని అన్నారు. మధ్య భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలకు ఆధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యం నాగపూర్ ఎయిమ్స్ ద్వారా నెరవేరిందని ఆయన అన్నారు. ఆధునిక వైద్య సేవలు కేవలం పట్టణ ప్రాంత ప్రజలకు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆరోగ్య రంగంలో ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని శ్రీ గడ్కరీ వివరించారు. దీనిలో భాగంగా అన్ని ప్రాంతాల్లో ఎయిమ్స్ సంస్థలు ఏర్పాటు అవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎయిమ్స్ సంఖ్యని రెట్టింపు చేయడం ద్వారా వైద్య రంగంలో అసమానతలను తొలగించి అందరికి ఆధునిక వైద్య సౌకర్యాలను అందించడానికి అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యల వల్ల దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలకు ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ పవార్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత దేశంలో ఆరు శతాబ్దాల కాలంలో కేవలం ఆరు ఎయిమ్స్ సంస్థలు మాత్రమే ఏర్పాటు అయ్యాయని ఆమె తెలిపారు. అయితే, 2014 లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలో ఎయిమ్స్ ను నెలకొల్పాలని నిర్ణయించి ఈ దిశలో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని అన్నారు.

మూడేళ్ల కాలంలో నాగపూర్ ఎయిమ్స్ సాధించిన ప్రగతి పట్ల డాక్టర్ పవార్ సంతృప్తి వ్యక్తం చేశారు. 2020 లో ఇక్కడ పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు పి హెచ్‌డి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని అన్నారు.

కోవిడ్ సమయంలో ఆరోగ్య సంరక్షణ సిబ్బంది సహకారంతో కేంద్రం ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టం చేసిందని డాక్టర్ పవార్ అన్నారు. ప్రాంత ప్రజలకు కోవిడ్ చికిత్సను అందించడానికి నాగపూర్ ఎయిమ్స్ కు ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో వెంటిలేటర్లు, హాస్పిటల్ పడకలు , ఆక్సిజన్ సిలిండర్లు, పీపీఈ కిట్లు, మాస్క్‌లు మరియు ప్రాణాలను కాపాడే ఔషధాలు మొదలైన సౌకర్యాలను సమకూర్చిందని మంత్రి తెలిపారు. కోవిడ్ మహమ్మారి రెండవ దశలో రోగులకు కోవిడ్ డయాలసిస్ సౌకర్యాన్ని అందించినందుకు ఆమె సంస్థను అభినందించారు.

ఒక డాక్టరుగా తన అనుభవాలను వివరించిన డాక్టర్ పవార్ వైద్యులు సానుభూతి, కరుణ చికిత్సలో కీలకంగా ఉంటాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైద్య విద్యార్థులు తమ ప్రవర్తనను మలచుకోవాలని అన్నారు. ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ ఈ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చేవారు ఎక్కువ సమయం నర్సులు, సహాయ సిబ్బందితో మాట్లాడవలసి వస్తుందని అన్నారు. తమతో మాట్లాడుతున్న రోగుల అవసరాలను తెలుసుకోవడానికి వీలవుతుందని అన్నారు. రోగుల సంరక్షణ అంశాన్ని కూడా విద్యా కార్యక్రమంలో చేర్చాలని అన్నారు.

చికిత్స ఖర్చు తగ్గించడం మరియు వైద్యుల సంఖ్యను పెంచడంతో పాటు ఆధునిక చికిత్స సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ నివారణ సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం సమగ్ర వైద్య విధానాన్ని అమలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నదని డాక్టర్ పవార్ వివరించారు. అంకితభావం, పట్టుదలతో పనిచేస్తూ సంస్థను ప్రగతి పథంలో నడిపిస్తున్న నాగపూర్ ఎయిమ్స్ సిబ్బంది పనిచేస్తున్నారని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య సంరక్షణ పథకాలను లక్ష్యాల మేరకు అమలు చేయాలని ఆమె కోరారు. సవాళ్ళను ఎదుర్కొని రాష్ట్రంలో వైద్య సంస్థలకు నాగపూర్ ఎయిమ్స్ మార్గదర్శిగా ఉండాలని ఆమె అన్నారు.

ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ మ్యాగజైన్ "అభిజ్ఞానం" ప్రారంభ సంచిక విడుదల చేయబడింది. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, నాగపూర్ ఎయిమ్స్ అధ్యక్షుడు డాక్టర్ దావే, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ విభా దుత్త సీనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

'నిధి 2.0', 'భారత పర్యాటక వివరాలు 2021'ల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:పర్యాటకం ద్వారా సంపూర్ణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రపంచ పర్యాటక సంస్థ సూచన మేరకు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక మంత్రిత్వ శాఖ రేపు (సెప్టెంబర్ 27) ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, సహాయ మంత్రులు శ్రీ అజయ్ భట్, శ్రీ శ్రీపాద్ యెస్సో కార్యక్రమంలో పాల్గొంటారు. పర్యాటక కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారు.

భారతదేశంలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనితో పర్యాటక రంగం నెమ్మదిగా కోలుకుంటూ సాధారణ స్థాయికి చేరుతున్నది. కోవిడ్-19 ప్రపంచవ్యాప్తంగా తన ప్రభావాన్ని చూపింది. కోవిడ్ ప్రభావం నుంచి అన్ని రంగాలతో పాటు పర్యాటక రంగం కూడా తేరుకుంటున్నది. పర్యాటకుల సంఖ్య పెరగడంతో పర్యాటక రంగం మరింత అభివృద్ధి సాధించడానికి సిద్ధంగా వుంది. పర్యాటక రంగం అనేక వర్గాలు, రంగాలపై ప్రభావం చూపుతుంది. అన్ని వర్గాలు, ప్రాంతాలతో పాటు వ్యవసాయం, కళలు, చేతి వృత్తులు లాంటి రంగాలు పర్యాటక రంగం వల్ల ప్రభావితం అవుతాయి. దీనితో దేశం అన్ని రంగాలలో సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి అవకాశం కలుగుతుంది. పర్యాటక రంగ ప్రాధాన్యతను గుర్తించిన ప్రపంచ దేశాలు ప్రతి ఏటా సెప్టెంబర్ 27 వ తేదీని ప్రపంచ పర్యాటక దినోత్సవంగా నిర్వహిస్తున్నాయి. పర్యాటక రంగ ప్రాధాన్యతను, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక రంగాలపై ఇది చూపే ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో నిధి 2.0 (నేషనల్ ఇంటిగ్రేటెడ్ డేటాబేస్ ఆఫ్ హాస్పిటాలిటీ ఇండస్ట్రీ) మరియు 'ఇండియా టూరిజం స్టాటిస్టిక్స్ - ఎట్ ఎ గ్లాన్స్ , 2021' ప్రారంభిస్తారు.

పర్యాటక రంగంలో సుస్థిరత కార్యక్రమాలను ప్రోత్సహించి అమలు చేయడానికి పర్యాటక మంత్రిత్వ శాఖ, యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం మరియు ది రెస్పాన్సిబుల్ టూరిజం సొసైటీ ఆఫ్ ఇండియాల మధ్య కుదిరిన ఒప్పందంపై సంతకం చేసే కార్యక్రమం కూడా జరుగుతుంది.

ప్రతి రంగంలోనూ గణనీయమైన అభివృద్ధి : ఎమ్మెల్యే వివేకానంద

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం, శాంతియుత వాతావరణం వల్ల భారీ పెట్టుబడులు వస్తున్నాయని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు. పరిశ్రమలు, ఐటీ రంగాల్లో జరిగిన అభివృద్ధి స్పష్టంగా కనబడుతోందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి రంగంలోనూ గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్నాం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ రంగాల ప్రగతిపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ.. ఐటీ పాలసీ, ఇండస్ట్రీయల్ పాలసీ టీఎస్ఐపాస్ ద్వారా అనేక పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చాయి. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. మన పాలసీలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రతి సంవత్సరం కూడా టాప్‌లోనే ఉన్నామన్నారు. ఐటీ, పరిశ్రమల రంగం జిల్లాలకు కూడా విస్తరించాయన్నారు.

వారం పదిరోజుల క్రితం కేరళకు చెందిన కిటెక్స్ గ్రూప్.. తెలంగాణలో రూ. 2400 కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. దీని ద్వారా 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మలబార్ గోల్డ్ రూ. 750 కోట్ల పెట్టుబడులు పెడుతామని ప్రకటించింది. రాష్ట్రం ఏర్పడిన తొలిరోజుల్లో పెట్టుబడులపై అనేక అనుమానాలు ఉండేవి. కానీ ఇప్పుడు పెట్టుబడులు తరలిరావడం రాష్ట్రానికి గర్వకారణంగా ఉందన్నారు. సింగపూర్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అనేక అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఐటీ రంగంలో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో స్టార్టప్‌లు అద్భుత విజయాలు సాధిస్తున్నాయి.

గత ప్రభుత్వాలు 40 ఏండ్లలో 23 వేల ఎకరాల్లో పరిశ్రమలను నెలకొల్పితే.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన ఏడేండ్లలో 40 వేల ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. ఐటీ హబ్‌లను జిల్లాలకు విస్తరిస్తున్నామని తెలిపారు. దేశ జీడీపీకి అత్యధికంగా ఆదాయం సమకూరుస్తున్న అతిపెద్ద నాలుగో రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐటీ పాలసీని జాతీయ స్థాయిలో అమలు చేయాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పేర్కొన్నట్లు ఎమ్మెల్యే వివేకానంద గుర్తు చేశారు.

పల్లెప్రగతితో విస్తృతమైన అభివృద్ధి: మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: పల్లెప్రగతి వంటి కార్యక్రమాలతో రాష్ట్రంలో అభివృద్ధి మరింత విస్తృతమైందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. స్థానిక సంస్థలకు తలసరి గ్రాంట్‌పై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా.. సీఎం కేసీఆర్ పాలనాపరమైన సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. గ్రామ పంచాయతీల సంఖ్యను 12,769కి పెంచారని చెప్పారు. 3,146 తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. పల్లె ప్రగతి వంటి పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరుతున్నదని చెప్పారు.

మూడో ఫైనాన్స్ కమిషన్ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు ఇచ్చే తలసరి గ్రాంటును 4:8:4 నుంచి 8:16:8 పెంచాలని సిఫారసు చేసిందని, 2017-18 వరకు 4:8:4 నిష్పత్తి విధానమే కొనసాగించని వెల్లడించారు. 2018-19 నుంచి విడుదలైన మొత్తం 2019-20 సెప్టెంబర్ నుంచి సెప్టెంబర్ 2021 వరకు పల్లె ప్రగతి కొరకు కేంద్ర ఫైనాన్స్ నిధులతో సమానమని తెలిపారు. రాష్ట్ర ఫైనాన్స్ నుంచి మొత్తం రూ.7 వేల 435 కోట్ల 48 లక్షలు విడుదల చేశామన్నారు.

రాధేయ కవితా పురస్కారం
డా. రాధేయ కవితా పురస్కారం 2020 2021
03-10-2021, ఉదయం 10.00 గంటలకు, పలమనేరు
సభాధ్యక్షులు :
పలమనేరు బాలాజీ
పురస్కార ప్రదాత :
డా.రాధేయ
ముఖ్య అతిథులు :
ఆచార్య మేడిపల్లి

మండల, జిల్లా ప్రజాపరిషత్‌లకు రూ. 500 కోట్లు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ , సెప్టెంబర్ 27: శాసనమండలిలో టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తొలిసారిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రం 15 ఫైనాన్స్ కమిషన్‌లో స్థానిక సంస్థలకు రూ. 500 కోట్లు లోటు పెట్టినా.. మండల ప్రజాపరిషత్‌లు, జిల్లా ప్రజాపరిషత్‌లు సభ్యుల గౌరవాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అదనంగా రూ. 500 కోట్లు కేటాయించారు. దీంతో ఎంపీపీలు, జడ్పీటీసీలు హర్షం వ్యక్తం చేశారు.

కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఎంపీపీలకు పర్మినెంట్ ఆఫీసులు లేకపోవడం తీరని లోటుగా ఉంది. కనీసం గ్రామపంచాయతీల్లో ఎంపీటీసీలకు కూర్చుందామంటే కుర్చీ లేదు. ఈ విషయంలో తగు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవం నాడు పాఠశాలలో జెండా ఎగురవేసి అధికారం ఎంపీటీసీ,జెడ్పీటీసీలకు అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు.

పెద్ద పులులను కాపాడుకుందాం : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం అరణ్య భవన్ వద్ద పులుల సంరక్షణ కోసం జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ' (ఎన్టీసీఏ) చేపట్టిన ఇండియా ఫర్ టైగర్స్ ? ఏ ర్యాలీ ఆన్ వీల్స్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ? ఆజాదీ కా అమృత్ మహోత్సవ్- వేడుకల్లో భాగంగా దేశంలోని అన్ని టైగర్ రిజర్వ్ లను కలుపుతూ పులుల సంరక్షణ కోసం జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) ఇండియా ఫర్ టైగర్స్ ? ఏ ర్యాలీ ఆన్ వీల్స్ ను అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పెద్ద పులులను సంరక్షణపై ప్రజలల్లో అవగాహన కల్పించడంతో పాటు వారిని భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో ఎన్టీసీఏ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. పులుల ఆవాసాల రక్షణ, విస్తరణకు ప్రజల మద్దతు అవసరమని, పులుల సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

హైదరాబాద్ టు ఒడిషా వయా కవ్వాల్ టైగర్ రిజర్వ్

ఈ ర్యాలీ ఇక్కడి నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఈ ప్రాంతం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. అక్కడి నుంచి మహారాష్ట్ర? ఇలా ఒడిషాలోని సిమిలిపాల్ టైగర్ రిజర్వ్ వద్ద ర్యాలీ ముగుస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో త్రికోణ అగ్రభాగాన నిలిచిన పులులను సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యానికి పెద్దపులులే కీలకం కావున జీవ వైవిధ్యం సమతూకంలో కొనసాగాలంటే? అడవుల్లో పెద్ద పులుల సంతతి వృద్ధి చేందేలా రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పులుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

పులుల సంరక్షణ, వాటి సంతతి వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో పాటు మన తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. పులుల సంరక్షణ పట్ల తెలంగాణ ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తుందన్నారు. తెలంగాణలోని రెండు టైగర్ రిజర్వ్ లలో పులుల సంఖ్య పెరగడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.

పులుల సంరక్షణతోనే అడవుల రక్షణ సాధ్యం

పులుల సంరక్షణతోనే అడవుల రక్షణ సాధ్యం అవుతుందని పీసీసీఎఫ్ ఆర్. శోభ అన్నారు. పులుల మనుగడకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. జీవవైవిధ్యంలో పులులు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్టీసీఏ ఈ ర్యాలీ చేపట్టిందన్నారు.

ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. శాంతికుమారి, పీసీసీఎఫ్ ఆర్. శోభ, పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం. డోబ్రియల్, పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, పీసీసీఎఫ్ (అడ్మిన్) స్వర్గం శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంలో భారీ వర్షాలు.. పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

ఖమ్మం, సెప్టెంబర్ 27: గులాబ్ తుఫాను ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీగా వర్షం కురుస్తున్నది. ఈ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్ ఆదేశించారు. వాగులు వంకలన్నీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో స్థానిక పోలీసులు తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్లు, గ్రామాలు జలమయమయ్యే ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి ఆటంకాలు కలగకుండా తక్షణమే పర్యవేక్షించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ఆవకాశం ఉండటంతో రోడ్డు రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా విద్యుత్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.మరో రెండు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుందని, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.

అక్టోబర్ 3 వరకూ ఎంఓ హెచ్‌యుఏ ఆజాది కా అమృత్ మహోత్సలు...

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:75 సంవత్సరాల ప్రగతిశీల భారతదేశం మరియు దాని అద్భుతమైన చరిత్రను జరుపుకోవడానికి గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఆజాది కా అమృత్ మహోత్సవం' వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 3, 2021 వరకు భారతదేశ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు మరియు వేడుకలను నిర్వహిస్తోంది. ఈ వారంలో ముఖ్యాంశం ఏమిటంటే అక్టోబర్ 1, 2021 న గౌరవనీయులైన ప్రధాని స్వచ్ఛ భారత్ మిషన్ -అర్బన్ 2.0 మరియు అమృత్- 2.0 లను ప్రారంభించడం.

ఆజాది కా అమృత్ మహోత్సవ్ (ఇండియా75) అనేది భారతదేశ స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాల శ్రేణి. జన్ భగీదరి స్ఫూర్తితో మహోత్సవాన్ని జన్ ఉత్సవ్‌గా జరుపుకుంటారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ మిషన్ -అర్బన్ 2.0 ని అక్టోబర్ 1, 2021 న ప్రారంభిస్తారు. 7 సంవత్సరాల స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ (ఎస్‌బిఎం-యు) వేడుకలను జరుపుకోవడానికి మంత్రిత్వ శాఖ ' స్వచ్ఛతా సే సంపన్నత --- 7 సంవత్సరాల వేడుకలను నిర్వహిస్తోంది. స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ కార్యక్రమం సెప్టెంబర్ 27, 2021 న 'స్వచ్ఛత యాప్ 2.0' మరియు 'స్వచ్ఛ సర్వేక్షన్ 2022' ప్రారంభించబడతాయి. అదే రోజున, 'కాచ్రా అలగ్ కరో అమృత్ దివాస్' నిర్వహించబడుతుంది. ఈ సమయంలో వార్డులలో/రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్లుఏఎస్) లో పట్టణ స్థానిక సంస్థల (యుఎల్‌బిఎస్) ద్వారా భారతదేశం అంతటా స్వచ్ఛాగ్రహి సమూహాల ద్వారా ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తారు. అత్యుత్తమంగా పనిచేసే రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్లమ్ డెవలప్‌మెంట్ అథారిటీస్‌తో పాటు ఇతరులకు సన్మానం కూడా ఆ రోజు జరుగుతుంది. సర్వజానిక్ సౌచాలయ సఫాయి జన్ భగీదరి అమృత్ ఉత్సవ్ 28 సెప్టెంబర్ -29, 2021 లో జరుపుకుంటారు. దీని కింద పౌరులు కమ్యూనిటీ మరియు పబ్లిక్ టాయిలెట్స్ పరిశుభ్రత అభిప్రాయాన్ని స్వీకరిస్తారు. సఫైమిత్ర సమ్మన్ అమృత్ సమారో కూడా అక్టోబర్ 2 మరియు 3 తేదీలలో నిర్వహించబడుతుంది. ఇందులో భాగంగా సఫాయి మిత్రులకు వర్చువల్ ఇంటరాక్షన్ మరియు రుణాల పంపిణీ జరుగుతుంది. పౌరులను చైతన్యవంతం చేయడానికి డిజిటల్ డిస్‌ప్లేలు ఉంటాయి. వేస్ట్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లకు సన్మానం, మరియు వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్స్/బర్తన్ భండార్స్' ప్రదర్శన కూడా నిర్వహించబడతాయి.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 1 అక్టోబర్, 2021 న అమృత్ 2.0 ని ప్రారంభించనున్నారు. అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎఎంఆర్‌యుటి) మొట్టమొదటిగా కేంద్రీకృతమైన జాతీయ నీటి మిషన్. ఇది 25 జూన్, 2015 న 500 నగరాలలో 60% పట్టణ జనాభాలో ప్రారంభించబడింది. 1 లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న అన్ని నగరాలు మిషన్ పరిధిలోకి వస్తాయి. మిషన్ యొక్క ప్రధాన లక్ష్యం పైప్ నీటి సరఫరా మరియు మురుగునీరు మరియు సెప్టేజ్ నిర్వహణ. తుఫాను నీటి పారుదల, మోటారు లేని పట్టణ రవాణా మరియు గ్రీన్ స్పేస్‌లు ఉ పార్కులు మిషన్‌లో ఇతర అంశాలు.

ఈ వారోత్సవంలో హౌసింగ్ ఫర్ ఆల్ (హెచ్ఎఫ్ఎ) పై వివిధ కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ రూపొందించింది. ఆవాస్ పర్ సంవాద్: బ్యాంకులు/ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌ల ద్వారా వర్క్‌షాప్‌లు అర్బన్ ల్యాండ్‌స్కేప్‌లో విస్తృత శ్రేణి ఇతివృత్తం. ప్రతి లైట్ హౌస్ ప్రాజెక్ట్ (ఎల్‌హెచ్‌పి) సైట్‌లో 75 టెక్నోగ్రాహీల సందర్శన చేపట్టబడుతుంది. భారతదేశం అంతటా పిఎంఏవై(యు) లబ్ధిదారులు పండ్లు మరియు ఔషధ మొక్కలను నాటవచ్చు. మోడల్ అద్దె చట్టం (ఎంటిఎ) ద్వారా అద్దె గృహ పరివర్తనపై ప్యానెల్ చర్చలు ఐకానిక్ వారంలో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయబడుతున్నాయి. మినిస్ట్రీ 'లాభార్తియ్యాన్ సె రుబారూన్' ని ప్రారంభిస్తుంది: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వమరియు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల లెడ్ కన్స్ట్రక్షన్ (పిఎల్‌సి) ఇళ్ల వర్చువల్ తనిఖీ ఉంటుంది. మంత్రిత్వ శాఖలో జరిగిన కార్యక్రమంలో 'మై భీ ఆత్మనిర్భర్' పిఎంఏవై(యు) మహిళా లబ్ధిదారులపై రూపొందించిన లఘు చిత్రం విడుదలైంది.

టాక్టికల్ అర్బనిజం ప్రాజెక్ట్‌లపై ఈవెంట్ (22 నగరాలు లీ 75 గంటలు) నిర్వహించబడతాయి. ఇది పబ్లిక్ ఈవెంట్‌లతో లైవ్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్, స్ట్రీట్ ఫుడ్స్, స్ట్రీట్ లెవల్ గేమ్స్/స్పోర్ట్స్, స్టోరీటెల్లింగ్, మూవీ స్క్రీనింగ్‌లు, కమ్యూనిటీ బాండ్స్ బిల్డింగ్ మొదలైన కార్యక్రమాలే కాకుండా థీమ్ ఫ్రీడమ్ఏ టెక్నాలజీ వంటివి నగరాలను ప్రారంభించే 75 ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ల (ఐసిసిసిలు) ద్వారా చూపబడతాయి. ఈ ఐసిసిసిలు నగరాలను ప్రారంభిస్తున్నాయి మరియు పౌరుల జీవితాలలో స్వేచ్ఛను జోడిస్తున్నాయి: వ్యర్థాల నుండి స్వేచ్ఛ; ట్రాఫిక్ నుండి స్వేచ్ఛ; నేరం నుండి స్వేచ్ఛ; నీటి కొరత నుండి స్వేచ్ఛ; క్యూల నుండి స్వేచ్ఛ; గ్రీన్ హౌస్ వాయువుల నుండి స్వేచ్ఛ (జిహెచ్‌జిలు); కాలుష్యం నుండి స్వేచ్ఛ; వ్యాధి నుండి స్వేచ్ఛ; మరియు అసమర్థత నుండి స్వేచ్ఛను కల్పిస్తున్నాయి.

నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్ కింద, ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఈ) మాడ్యూల్ మరియు ఆన్‌లైన్‌లో రివాల్వింగ్ ఫండ్ (ఆర్ఎఫ్) ను ఏరియా లెవల్ ఫెడరేషన్స్ (ఎఎల్ఎఫ్) కి బదిలీ చేసినప్పటికీ పైసా పోర్టల్ ప్రారంభించబడుతుంది. స్వనిధి సే సమృద్ధి శిబిరాలు నిర్వహించబడతాయి.

అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్‌లో దేశవ్యాప్తంగా ఐకానిక్ వీక్‌లో ఈ క్రింది ఈవెంట్‌లు నిర్వహించాలని ప్రతిపాదించబడ్డాయి:మెట్రో నెట్‌వర్క్ అంతటా ముఖ్యమైన స్టేషన్లలో ఉన్న ఈవెంట్ కార్నర్స్ వద్ద ఫోటోలు మరియు సంక్షిప్త సమాచార ప్రదర్శన ద్వారా భారత స్వాతంత్ర్యంలోని ప్రధాన సంఘటనల చిత్రణ.స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల ట్రివియాతో పాటు ఎకేఎం థీమ్ లోగోను స్క్రీనింగ్ చేయడం

ప్రధాన స్టేషన్లలో ఇన్‌స్టాల్ చేయబడిన ఎల్ఈడి స్క్రీన్‌లపై మెట్రో రైలు రంగంలో సాధించిన విజయాలుతో ఇతర విజయాలను ప్రదర్శించడం.ఎల్ఈడి స్క్రీన్‌లు అందుబాటులో ఉన్న రైళ్ల లోపల ఇలాంటి కంటెంట్ ప్రదర్శన.

75 సంవత్సరాల ఎకెఎఎం లోగోను కళాత్మక పద్ధతిలో ఏర్పాటుచేయడం. ఇక్కడ ప్రజలు సెల్ఫీలు కూడా తీసుకోవచ్చు. ఇవి మెట్రో హెచ్‌క్యూ లో ఉంచబడతాయి మరియు వివిధ స్టేషన్లు/సైట్లలో తరలించబడతాయి.

స్టేషన్లు మరియు రైళ్ల లోపల ఖాళీగా ఉన్న యాడ్ ప్యానెల్‌లు విస్తృత ప్రజల అవగాహన కోసం ఎకెఎఎం సందేశాన్ని ప్రచారం చేయడానికి కూడా ఉపయోగించబడతాయి.

వని ప్రదేశాలు/డిపోలలో చెట్ల పెంపకం.

ఫ్రీడమ్ ఫైటర్స్‌పై ఆడియో/ వీడియో సందేశాలు.

కార్యాచరణ కేంద్రాల స్తంభాలపై వారసత్వ కట్టడాల ప్రదర్శన.

నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రమోషన్- సైక్లోథాన్/మారథాన్.

పాఠశాల పిల్లలకు అవగాహన కార్యక్రమం.

ఈ వారోత్సవంలో'కొత్త నిర్మాణ సామగ్రి మరియు సాంకేతికతలు', 'ఆసుపత్రి నిర్మాణం మరియు పరికరాల రంగంలో సాంకేతికత' మరియు 'ఈఆర్‌పితో సిపిడబ్లుడి భవిష్యత్తు' అనే అంశంపై వెబ్‌నార్‌లను నిర్వహిస్తుంది. అక్టోబర్ 2, 2021 న నిర్వహించే 75 రెసిడెన్షియల్ కాలనీలలో ప్లాంటేషన్ మరియు శానిటేషన్ డ్రైవ్‌లను కూడా చేపట్టనుంది. సిబిడబ్లుడి నిర్వహిస్తున్న 75 రెసిడెన్షియల్ కాలనీలలో ఆర్‌డబ్లుఏ సంప్రదింపులు జరుగుతాయి. సిపిడబ్లుడి యొక్క 75 ప్రాజెక్టుల కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఆరోగ్య తనిఖీ శిబిరాలను నిర్వహిస్తారు.

వార్ మ్యూజియంను సందర్శించిన వెంకయ్యనాయుడు

జైపూర్ సెప్టెంబర్ 27:రాజస్థాన్ పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.. సోమవారం జైసల్మేర్‌లోని పలు ప్రాంతాలను సందర్శిస్తున్నారు. జైసల్మేర్ లోని వార్ మ్యూజియంను సందర్శించారు. సాయంత్రం జోధ్‌పూర్‌కు వెళ్లి అక్కడి మెహ్రాన్‌ఘడ్ కోటను, మ్యూజియంను తిలకిస్తారు. సాయంత్రం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలలో కుటుంబసమేతంగా హాజరుకానున్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు 5 రోజుల రాజస్థాన్ పర్యటనలో భాగంగా తొలిరోజు ఆదివారం తనోట్ మాత ఆలయం, లంగేవాలా వార్ మ్యూజియాన్ని సందర్శించారు. రెండవ రోజు జైసల్మేర్, జోధ్‌పూర్‌లో పర్యటిస్తారు. జైసల్మేర్‌లోని జోధ్‌పూర్ రోడ్‌లో ఉన్న వార్ మ్యూజియం ప్రధాన ద్వారం వద్ద అమరవీరులకు పూలమాల వేసి నివాళు లర్పించారు. వార్ మ్యూజియంలోని లంగేవాలా హాల్ వెలుపల ఒక మొక్కను కూడా వెంకయ్యనాయుడు నాటారు. ఉ పరాష్ట్రపతి వెంట ఆయన భార్య ఉషా నాయుడు, రాజస్థాన్ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, కేంద్ర మంత్రి కైలాష్ చౌదరి, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి బీడీ కల్లా, ఎస్పీ అజయ్ సింగ్ తదితరులు ఉన్నారు. వార్ మ్యూజియంలో మేజర్ జనరల్ అజిత్ సింగ్ గెహ్లోట్ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు. అమరవీరులు, సైనికుల కోసం తన ఆలోచనలను పంచుకోవడానికి అక్కడ ఉంచిన స్మారక పుస్తకంలో తన మనోభావాలను పొందుపరిచారు.

అనంతరం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నార్త్ హెడ్‌క్వార్టర్స్ 191 బెటాలియన్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయన గార్డ్ ఆఫ్ హానర్ అందుకున్నారు. బీఎస్ఎఫ్ డీఐజీ పంకజ్ ఘూమర్ ఘనంగా స్వాగతం పలికి బీఎస్ఎఫ్ టోపీని బహూకరించారు. అక్కడ ఏర్పాటు చేసిన సైనిక్ సదస్సులో వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మధ్యాహ్న భోజనం అనంతరం ప్రత్యేక విమానంలో జోధ్‌పూర్ వెళ్తారు.

సంగారెడ్డిలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి..!!

సంగారెడ్డి, సెప్టెంబర్ 27(నేటినిజం ప్రతినిధి) బలహీన వర్గాల బతుకులను మార్చడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ 126వ జయంతి సందర్భంగా ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్ పక్కన ఏర్పాటుచేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ, మున్సిపల్ చైర్ పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు.

చాకలి ఐలమ్మ సాదాసీదా వ్యక్తి అయినా ఆర్థిక, అంగబలం లేకున్నా ధైర్యంగా నిజాం ప్రభుత్వానికి ఎదురొడ్డి పోరాడిన ధీర వనిత అని అన్నారు. పోరాటం చేస్తూనే అణగారిన వర్గాల కోసం అండగా నిలిచిందన్నారు.

నేటి యువత, మహిళలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో దౌర్జన్యాలను, అక్రమాలను అడ్డుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆమె చరిత్రను తెలుసుకునే విధంగా పాఠ్య పుస్తకాలలోఒక పాఠ్యాంశంగా చేరిస్తే బాగుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. భయం పోయి ధైర్యంగా ఎదుర్కొన్న ప్పుడే సమాజానికి మంచి చేయగలమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ జయంతి ని మొట్ట మొదటిసారిగా అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. వారి ఆశయాలను అనుసరించడం, రాబోవు తరాలకు తెలియజేసే విధంగా జయంతి జరుపు కుంటూన్నామని ఆయన అన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ నిజాం కాలంలో గెరిల్లా పద్ధతిలో సాయుధ పోరాటం చేసిందన్నారు. తాను నమ్ముకున్న భూమిపై తనకే హక్కు ఉందని తెలియజెప్పిన ధీరవనిత అని కొనియాడారు.

అధునాతన పోకడలకు అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకొని కులవృత్తులు అభివృద్ధి చేసుకోవాలనీ సూచించారు. ప్రభుత్వం కుల వృత్తుల కనుగుణంగా వారి అభిరుచికి తగ్గట్టుగా అభివృద్ధి దిశగా ముందుకు వెళుతుందన్నారు.

రజక సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు ఇవ్వాలని కుల సంఘం ప్రతినిధులు కోరగా, జిల్లా మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి సహకరిస్తామన్నారు.

తెలంగాణ సమాజం కోసం స్వాతంత్రం కోసం పోరాడిన వారి గురించి తెలిసే విధంగా

వీరనారి ఐలమ్మ జీవిత చరిత్రను అదేవిధంగా ప్రముఖుల చరిత్రను ఆసక్తికరంగా ఉండే విధంగా ముఖ్య ఘట్టాలను తీసుకొని బుక్ లెట్ / పాంప్లెంట్ రూపంలో రానున్న ఆరునెలల్లో ముద్రించి యువతకు విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కి సూచించారు. ముద్రణకు సీఎస్ఆర్ నిధుల నుండి డబ్బులు ఇవ్వడానికి కలెక్టర్ సంసిద్ధతను తెలిపారు.

జిల్లా ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణకు చెందిన అనేక మంది పోరాట యోధులను గుర్తించి జయంతులను నిర్వహిస్తోందన్నారు.

చాకలి ఐలమ్మ ఒక వర్గానికి, కులానికి చెందినది కాదని, ఆమెకు జరుగుతున్న అన్యాయం తో పాటు సమాజానికి జరుగుతున్న అన్యాయాలను ఎదిరించిందన్నారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో ధైర్యంగా పోరాటం సాగించిందని ఆయన పేర్కొన్నారు. ఆమె స్ఫూర్తితో అన్యాయాలను ఎదిరించాలన్నారు.

మాజీ శాసనసభ్యులు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ బానిస బతుకులు విముక్తి చేయాలని సాయుధ పోరాటం చేసిన నారీమని ఐలమ్మ అన్నారు. చేతివృత్తులు, కులవృత్తులకు సమన్యాయం చేస్తు

తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అన్ని కులాలకు సముచిత గౌరవం దక్కాలని, అన్ని వర్గాలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ముందుకు వెళ్తున్నారన్నారు.

రజక భవనం కోసం కలెక్టర్ ద్వారా మంత్రి, ప్రభుత్వము దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ లావణ్య, డిఎస్పి బాలాజీ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కేశరాం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వివిధ కుల సంఘాల ప్రతినిధులు మహేష్ జీతయ్య, మాణిక్యం ,గణేష్, రమేష్ కూన వేణుగోపాల్, నామ మహేష్,బీరా యాదవ్, గోలి యాదగిరి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ కేబినెట్‌కు విస్తరణ ముహూర్తం ఫిక్స్..!!

అమరావతి, సెప్టెంబర్ 27:ఏపీలో సీఎం జగన్ తన కేబినెట్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కేబినెట్ ను పూర్తిగా తప్పించి కొత్త వారితో ఎన్నికల కేబినెట్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇందు కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు విశ్వసనీయ సమాచారం. తాజాగా మంత్రి బాలినేని సీఎం తనతో చెప్పిన విషయాలను బయట పెట్టటం వెనుక కూడా ఒక వ్యూహం ప్రకారమే జరిగినట్లుగా కనిపిస్తోంది.

ఇప్పుడున్న మంత్రుల్లో కొందరిని తొలిగించి మరి కొందరిని కొనసాగిస్తే కొత్త సమస్యలు తప్పవనే అంచనాకు వచ్చారు. దీంతో విధానపరమైన నిర్ణయంగా అందరినీ తప్పిస్తే సమస్య ఉండదని భావిస్తున్నారు.2024 ఎలక్షన్ కేబినెట్ కసరత్తు షురూ

ఇదే సమయంలో చాలా మంది సీనియర్లు..పార్టీ కోసం తొలి నుంచి పని చేస్తున్న వారు..బలమైన వాయిస్ ఉన్న వారికీ తొలి సారి కేబినెట్ లో స్థానం దక్కలేదు. దీంతో ఈ సారి వారికి ఛాన్స్ కనిపిస్తోంది.

దసరా సమయంలో విస్తరణ ఉంటుందనే అంచనాలు ప్రభుత్వంలో.. పార్టీలో కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఇంటలిజెన్స్.. సర్వే సంస్థల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా సీఎం జగన్ కేబినెట్ కూర్పు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ప్రాంతీయ-సామాజిక సమీకరణాలు కీలకం కావటంతో ఏ జిల్లా నుంచి ఎవరు రేసులో ఉన్నారు. సామాజికంగా ఎవరికి అవకాశం ఉందనే చర్చ మొదలైంది.

శ్రీకాకుళం జిల్లా నుండి ప్రస్తుత స్పీకర్ తమ్మినేని సీతారాం మంత్రి పదవి ఆశిస్తున్నారు. అదే విధంగా ధర్మాన క్రిష్ణదాస్ స్థానంలో సోదరుడు ధర్మాన ప్రసాదరావుకు ఖాయమని చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో కొత్తగా కోలగట్ల వీరభద్రస్వామి..పీడిక రాజన్నదొర రేసులో ముందున్నారు. అయితే, ఎస్టీ మహిళకు అవకాశం ఇవ్వాలని భావిస్తే రాజన్న దొరకు ఛాన్స్ కష్టమే. విశాఖ జిల్లా నుండి గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ,పెట్ల ఉమా శంకరగణేష్ మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అయితే,ఈ జిల్లా నుంచి ముత్యాల నాయుడు పేరు వినిపిస్తోంది. నిఘా- సర్వే నివేదికల ఆధారంగా విశాఖ నగరానికి అవకాశం ఇవ్వాలనుకుంటే అమర్ నాథ్ కు ఛాన్స్ ఉంది.

గిరిజన కోటాలో ఫాల్గుణ, కె.భాగ్యలక్ష్మి కూడా మంత్రి పదవిని కోరుకుంటున్నారు.

తొలి నెలలోనే 1.7కోట్ల రిజిస్ట్రేషన్లు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: దేశంలోని అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర కార్మిక వ్యవహారాలు, ఉపాధి కల్పనా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ (వ-ూష్ట్రతీజీఏ) పోర్టల్ ద్వారా, రికార్డ్ స్థాయిలో కార్మికులు నమోదయ్యారు. ఈ పోర్టల్ ప్రారంభించి నెలరోజులు ముగియగానే, కోటీ 71లక్షలకు పైగా అసంఘటిత రంగ కార్మికుల వివరాల నమోదు జరిగింది. 2021వ సంవత్సరం సెప్టెంబరు 25వ తేదీ నాటికి, 1,71,59,743మంది కార్మికుల వివరాలు ఈ పోర్టల్ ద్వారా నమోదయ్యాయి.

ఈ-శ్రమ్శ్రీ (ష్ట్రబిబిజూబ://వబష్ట్రతీజీఏ.ణనీల.తిని/) పోర్టల్.కు.. 2021 ఆగస్టు 26వ తేదీన కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ శ్రీకారం చుట్టారు. కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా శాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలీ సమక్షంలో ఈ పోర్టల్ ప్రారంభోత్సవం జరిగింది. వలస కూలీలు, నిర్మాణ రంగం కార్మికులు, గిగ్ వర్కర్లు, ప్లాట్.ఫాం వర్కర్లతో సహా అసంఘటిత రంగంలోని కార్మికులందరి వివరాలను అందించగలిగే తొలి జాతీయ స్థాయి సమాచార వ్యవస్థగా (డేటాబేస్)గా ఈ పోర్టల్ రూపుదిద్దుకుంది. అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక రంగ పథకాల ప్రయోజనాలను అందించేందుకు ఈ పోర్టల్ దోహదపడుతుంది.

ఈ-శ్రమ్ పోర్టల్లో కార్మికుల నమోదు ప్రక్రియకు సంబంధించి వారాలవారీగా చోటుచేసుకున్న ప్రగతిని ఈ పట్టిక సూచిస్తోంది. ఈ పోర్టల్ ద్వారా వారం వారం కార్మికుల సమీకరణ పెరుగుతూ రావడంతో కార్మికుల నమోదు ప్రక్రియ మరింత బలోపేతంగా రూపుదాల్చింది. రెండవ వారంలో రిజిస్టరైన 19.52 లక్షల రిజిస్ట్రేషన్లతో పోల్చినపుడు,..మూడవ, నాలుగవ వారంలో చాలా ఎక్కువ స్థాయిలో నమోదు జరిగింది. నాలుగవ వారంలో ఏకంగా 69.53లక్షల మంది కార్మికుల వివరాలు ఇ-శ్రమ్ పోర్టల్ లో నమోదయ్యాయి.

కార్మికుల నమోదు ప్రక్రియను పటిష్టపరిచే మరిన్ని చర్యలను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో అసంఘటిత రంగ కార్మికులకు ఇ-శ్రమ కార్డులను కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ నిన్న పంపిణీ చేశారు. కోవిడ్ వైరస్ వ్యాప్తితో ప్రాణాలు కోల్పోయిన కార్మికులపై ఆధారపడిన వారికి ఇ.ఎస్.ఐ. కోవిడ్-19 సహాయ పథకానికి సంబంధించిన అనుమతి లేఖలను కూడా భూపేందర్ యాదవ్ పంపిణీ చేశారు. వాటితోపాటుగా, అటల్ బీమిత్ వ్యక్తి కల్యాణ్ యోజన సహాయ పథకానికి సంబంధించిన అనుమతి లేఖలను కూడా కేంద్రమంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ, అసంఘటిత రంగంలోని ప్రతి కార్మికుడూ తన వివరాలను, ఈ-శ్రమ్ పోర్టల్.లో నమోదు చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. "కార్మికుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రతి రంగంలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారో మేం తెలుసుకోవాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాల్సిందే. ఇప్పటికే పోర్టల్ ద్వారా 400 రంగాలను ప్రాతినిధ్యం లభించింది. చాలా చిన్నపాటి పనులు చేసుకునే వారితో సహా, ప్రతి ఒక్క కార్మికుడూ ఈ-పోర్టల్.లో తన పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని మేం కోరుకుంటున్నాం. అప్పుడే వారంతా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి వీలుంటుంది. దీనికి తోడు, పోర్టల్ లో రిజిస్టర్ చేయించుకువారికి రూ. 2లక్షల వరకూ బీమా సదుపాయానికి వారికి అర్హత ఉంటుంది." అని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు, అసంఘటిత రంగ కార్మికులు, యాజమాన్యాలతో కేంద్రమంత్రి యాదవ్ ముచ్చటించారు. చర్చలు జరిపారు. కేంద్ర కార్మిక వ్యవహారాల చీఫ్ కమిషనర్ (సెంట్రల్) డి.పి.ఎస్. నెగీ, డిప్యూటీ చీఫ్ కమిషనర్ (సెంట్రల్) తేజ్ బహదూర్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు.

డి.పి.ఎస్. నెగీ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ-శ్రమ్ పోర్టల్.ను విజయవంతం చేయడంలో స్థానిక పరిపాలనా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు కీలక పాత్ర ఉంటుందని, గిగ్ సిబ్బందిని నియమించుకునే యాప్ ఆధారిత సేవాసంస్థలు, అసంఘటిత రంగ కార్మికులు కూడా ఈ విషయంలో గణనీయమైన పాత్ర పోషించవలసి ఉంటుందని అన్నారు. ఈ-పోర్టల్ కృషిని ముందుకు తీసుకుపోవాలంటే, కార్మికుల విశ్వాసం, సంబంధిత భాగస్వామ్య వర్గాల కృషి ఎంతో అవసరమన్నారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన సబ్ కా సాత్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అన్న తత్వానికి అనుగుణంగా ఈ కృషి జరగాల్సి ఉందని ఆయన అన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా ఇప్పటిదాకా నమోదైన కార్మికుల్లో దాదాపు 50శాతం మంది మహిళలే ఉన్నారు. పైగా, ప్రతివారం నమోదయ్యే మహిళా కార్మికుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. వారంతట వారే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. మొదటి వారంలో 37శాతం ఉన్న మహిళా కార్మికుల నమోదు,

చివర్లో, అంటే.. నాలుగో వారం ముగిసే నాటికి దాదాపు 50శాతానికి పెరిగింది.

గత వారంలో నమోదు ప్రక్రియను పరిశీలించగా, ఇళ్లలో పని మనుషులుగా ఉపాధి పొందే మహిళా కార్మికులు గణనీయమైన సంఖ్యలో తమ వివరాలను పోర్టల్.లో రిజిస్టర్ చేయించుకున్నట్టు తెలిసింది. ఈ కేటగిరీలో పురుషుల సంఖ్య కంటే, మహిళా కార్మికుల సంఖ్యే ఎక్కువగా ఉంది. దీనికి తోడుగా, వ్యవసాయ రంగంలో కార్మికులుగా, ఆహార పరిశ్రమల్లో సహాయకులుగా, మెషిన్ ఆపరేటర్లుగా, దుస్తుల పరిశ్రమల్లో సహాయక సిబ్బందిగా, టైలర్లుగా, పొగాకు, బీడీ రోలింగ్ వంటి చిన్నతరహా పరిశ్రమల్లో సిబ్బందిగా, ఆరోగ్య రక్షణ రంగంలో ఆశా వర్కర్లు/ఎ.ఎన్.ఎం.లుగా మహిళల గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. అంటే, ఈ-శ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా, ఎక్కువ శారీరక శ్రమకు గురయ్యేందుకు ఆస్కారం ఉన్న మహిళలు వివిధ రక్షణ పథకాల ద్వారా బీమా సదుపాయం పొందుతున్నట్టు భావించవచ్చు. ఇ-శ్రమ్ పోర్టల్ లో నమోదు ప్రక్రియకు సంబంధించి తొలి వారంనుంచి ఒడిశా, బీహార్ రాష్ట్రాలు మొదటి ర్యాంక్.కోసం పోటీ పడుతూ వచ్చాయి. అయితే, 3వ, 4వ వారం మధ్య, బీహార్ రాష్ట్రం ఒకటవ ర్యాంకునుంచి 3వ ర్యాంకుకు దిగజారింది. ఒడిశా మాత్రం మొత్తం 4 వారాలకుగాను, ఏకంగా మూడేసి వారాలు మొదటి ర్యాంకులోనే కొనసాగింది. ఈ-శ్రమ్ పోర్టల్.ను ప్రారంభించినప్పటినుంచి అసంఘటితరంగ కార్మికుల వివరాల రిజిస్ట్రేషన్ల విషయంలో ఒడిశా తన మొదటి ర్యాంకును కొనసాగిస్తూనే వచ్చింది.

ఇ-శ్రమ్ పోర్టల్.లో అసంఘటిత రంగ కార్మికుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను విజయవంతం చేయడంలో ఉమ్మడి సేవా కేంద్రాల (సి.ఎస్.సి.ల) పాత్ర కీలకంగా ఉంటుంది. పై పట్టికలో సూచించిన అంకెలను పరిశీలించినపుడు, రిజిస్ట్రేషన్లకు అనువైన మార్గాలుగా సి.ఎస్.సి.ల పాత్ర, వాటి ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. ఇ-శ్రమ్ పోర్టల్ ప్రారంభమైన తొలి వారంలో 56.36శాతం రిజిస్ట్రేషన్లు సి.ఎస్.సి.ల ద్వారానే జరిగాయి. నాలుగో వారంలో 78శాతంమేర కార్మికుల వివరాల రిజిస్ట్రేషన్ సి.ఎస్.సి.ల ద్వారానే జరిగింది. ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని అసంఘటిత రంగ కార్మికుల వివరాలను సి.ఎస్.సి.ల ద్వారా ఈ-శ్రమ్ పోర్టల్.లో నమోదు చేయించడంలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతపు పరిపాలనా యంత్రాగాలకు కీలకపాత్ర ఉంటుంది.

ఈ-శ్రమ్ పోర్టల్.ను ఆధార్ వ్యవస్థతో అనుసంధానం చేస్తారు. రిజిస్టర్ చేయించుకున్న కార్మికుల పేర్లు, వృత్తులు, చిరునామాలు, విద్యార్హతలు, నైపుణ్యం రకాలు, కుటుంబ వివరాలు వంటివి ఇందులో నమోదై ఉంటాయి. ఈ వివరాలు అందుబాటులో ఉండటం వల్ల, వారికి ఉపాధి కల్పించే అవకాశం కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుంది. తద్వారా, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందుకోవడానికి కూడా వారికి వీలుంటుంది.

అసంఘటిత రంగంలో పనిచేస్తూ, 16నుంచి 59ఏళ్ల వయస్సున్న కార్మికులెవరికైనా ఈ-శ్రమ్ పోర్టల్.లో తమ వివరాలు నమోదు చేసుకునేందుకు అర్హత ఉంటుంది. అసంఘటిత రంగంలోని వలస కూలీలు, గిగ్ సిబ్బంది, ప్లాట్ ఫాం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులు, మత్స్యకారులు, పాలుపోసేవారు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ కార్మికులు, వీధి వ్యాపారులు, ఇళ్లలో పనిచేసే పనిమనుషులు, రిక్షావాలాలు తదితర అసంఘటిత రంగ కార్మికులకు తమ వివరాలను ఈ పోర్టల్.లో నమోదు చేసుకునే అర్హత ఉంటుంది.

ఢిల్లీలో టూరిజం యాప్‌ను ప్రారంభించిన సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:: ఢిల్లీలో టూరిస్టుల సౌలభ్యం కోసం అక్కడి సర్కారు టూరిజం యాప్‌ను ప్రారంభించింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్వయంగా యాప్‌ను లాంచ్ చేశారు. ఈ రోజు తాము ఒక టూరిజం యాప్‌ను ప్రారంభించామని, ఈ యాప్‌లో ఢిల్లీలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రదేశాలకు సంబంధించిన సమాచారం ఉంటుందని కేజ్రీవాల్ చెప్పారు. అదేవిధంగా వివిధ పర్యాటక ప్రాంతాల సందర్శనకు సంబంధించిన టికెట్‌లను బుక్ చేసుకునే సౌలభ్యం కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉందన్నారు.

ఢిల్లీ వాసులేగాక దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు కూడా ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చని కేజ్రీవాల్ తెలిపారు. ప్రత్యేకించి విదేశీ పర్యాటకులకు ఈ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఢిల్లీ పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వాళ్లు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఢిల్లీలో టూరిజం అభివృద్ధికి కూడా ఈ యాప్ ఉపయోగపడుతుందని కేజ్రీవాల్ ఆశాభావం వ్యక్తంచేశారు.

బార్ అండ్ రెస్టారెంట్లలోనూ రిజర్వేషన్లు..! : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:మద్యం షాపుల్లో రిజర్వేషన్లు కల్పించిన మాదిరిగానే బార్ అండ్ రెస్టారెంట్లలోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

మద్యం షాపుల్లో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. భారతదేశంలో గొప్ప విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు సీఎం కేసీఆర్. వందల రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారు. విద్యతో పాటు బీసీ కులాలు ఆర్థికంగా ఎదిగేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఆర్థిక వనరులపై సీఎం దృష్టి సారించారు. బార్ అండ్ రెస్టారెంట్లలో కూడా రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనిపై పరిశీలన చేస్తామన్నారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. జిల్లాల వారీగా రిజర్వేషన్లు కల్పించి, నిష్పక్షపాతంగా కేటాయింపులు చేస్తామన్నారు. గౌడ కులస్తులను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగానే చూశాయి అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలి - కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 27:(నేటినిజం ప్రతినిధి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల కు నల్లనే చట్టాలకు వ్యతిరేకంగా సోమవారం ఏసీ ఏఐసిసి అధ్యక్షురాలు సోనియా గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా అఖిలపక్షల పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలో నిర్వహిస్తున్న భారత్ బంద్ స్వచ్ఛందంగా పట్టణ వ్యాపారస్తులు పట్టణ ప్రజల మద్దతుతో బంద్ విజయవంతమైంది .అఖిలపక్షల ఆధ్వర్యంలో ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని లేని ఎడల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుతామని అన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఖాళీ ఉద్యోగాల భర్తీ చేయాలని కోరారు.దేశంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం అంబానీలకు లాభం చేకూర్చే విధంగా రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని, రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర లేకుండా, మోడీ ప్రభుత్వం దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధంగా రూపకల్పన చేసి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నం బిజెపి అవలంబిస్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సాగరం వెంకటస్వామి,బొజ్జ కనకయ్య మె?డిగే చంద్రశేఖర్ ,పెల్లి కనుకయ్య చిలుక రమేష్ చంద్ర గిరి శ్రీనివాస్ గౌడ్,నాగుల విష్ణు కుమార్,కనికరపు రాకేశ్ చిలివేరి శ్రీనివాస్ గౌడ్, బొజ్జ భారతి ,నాగుల రాముగౌడ్ బాల బ్రహ్మం ,తోటల హరి, లింగంపెల్లి కిరణ్, వస్తాదుల కృష్ణ గౌడ్ ,పల్లపు రాజేందర్, ఎర్ర అగయ్య, చీర్లవంచ రమేష్ ,మర్రి పల్లి రాజు ,కదారి రాములు, వనపర్తి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు .

అధ్య గోలి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడుకు మాతృవియోగం.

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 27:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన అధ్య గోలి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోలి మోహన్ కు మాతృవియోగం సంభవించింది. గోలి మోహన్ మాతృ మూర్తి గోలి మల్లమ్మ కరీంనగర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. మృతురాలుకు నలుగురు కుమారులు ఉన్నారు విదేశాల్లో ఉన్న ఆమె ముగ్గురు కుమారులు వచ్చిన తనకు సలహాలు ముగ్గురు కుమారులు లోకి వచ్చిన తర్వాత అంతిమ సంస్కారం నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.మృతికి , వేములవాడ పట్టణ,రాజన్న సిరిసిల్లజిల్లాలోని ,ప్రజాప్రతినిధులు,రాజకీయనాయకులు, సంతాపం వ్యక్తం చేశారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు

ప్రతిపక్ష నాయకులే మాకు బ్రాండ్ అంబాసిడర్లు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రతిపక్ష నాయకులే తమకు బ్రాండ్ అంబాసిడర్లు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు పాదయాత్రలు చేస్తున్నారు. పాదయాత్రల్లో భాగంగా వారు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న వీడియోల్లో కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. దీంతో వారికి పరోక్షంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ రంగాల ప్రగతిపై శాసన సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు. సభ్యులు మాట్లాడిన అనంతరం కేటీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు.ఐటీ, పరిశ్రమ రంగాలపై రాజకీయాలకు అతీతంగా మాట్లాడుకోవాలి. ఉపాధి కల్పనకు పెద్దపీట వేసే రంగంలో ఐటీ, పరిశ్రమల రంగం ఒకటి అని చెప్పొచ్చు. మన రాష్ట్రానికి జరుగుతున్న మంచి పనులను రాజకీయాలకు అతీతంగా మాట్లాడితే స్వాగతించాలి. ప్రపంచం మొత్తం నాలుగో పారిశ్రామిక విప్లవం ముంగిట మనం ఉన్నాం. స్టీమ్ ఇంజిన్ రైలు కనుగొనబడినప్పుడు మొదటి పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఎలక్ట్రిక్ శక్తితో రెండో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఈ రెండు విప్లవాలను దేశం అందుకోలే కపోయింది. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్లతో మూడో పారిశ్రామిక విప్లవం వచ్చింది. దీన్ని కొంత అందిపుచ్చుకున్నాం. ఇప్పుడు నాలుగో పారిశ్రామిక విప్లవం ముంగిట ఉన్నాం. ఇప్పుడు ఐటీ రంగంలో అద్భుతాలు సృష్టించే అవకాశం భారతదేశానికి ఉంది.నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని భారతదేశం అందిపుచ్చుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు. టెలికం రంగంలో విప్లవం వచ్చింది. భవిష్యత్‌లో 3డీ ప్రింటింగ్‌తో చిన్నచిన్న సైజు ఇండ్లను నిర్మాణం చేసే అవకాశం ఉంది. డిజిటల్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. సామాన్యుడికి ఉపయోగపడని సాంకేతికత నిష్పలం అని సీఎం కేసీఆర్ చెబుతారు. ఐటీ రంగంలో అభివృద్ధి జరుగుతుందని బీజేపీ, ఎంఐఎం పార్టీలు కూడా ఒప్పుకున్నాయి.

ప్రతిపక్షాలపై ఫైర్

ఒకాయన నిరుద్యోగ గర్జన, మరొకరు మిలియన్ మార్చ్ చేస్తామని అంటారు. తెలంగాణ రాష్ట్రమే నీళ్లు, నిధులు, నియామకాల మీద ఏర్పడింది. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సాగునీటి రంగంలో అసాధారణ అభివృద్ధి జరిగింది. సాగునీటి రంగంలో సాధించిన విజయాలను కేంద్రమంత్రులే ప్రశంసిస్తున్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నది అని ఆర్బీఐ, నీతి ఆయోగ్ నివేదికలు విడుదల చేసింది. ప్రపంచంలోని ఏ దేశమైనా, ఏ ప్రభుత్వమైనా.. 5 శాతం కంటే ఎక్కువగా ఉద్యోగాలు ఇచ్చే అవకాశం లేదు. మన జనాభా 4 కోట్లు అనుకుంటే.. ఒక రెండు శాతానికి మించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చే అవకాశం లేదు. ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. వీరికి ఉద్యోగాలు ఇవ్వాలంటే ప్రయివేటు రంగంపైనే ఆధారపడాలి. ప్రయివేటు రంగంలో పెట్టుబడులు ఆహ్వానించి ఉద్యోగాలు కల్పించాలి తప్ప వేరే దారి లేదు. తెలంగాణ ప్రభుత్వం ముందు చూపుతో ప్రయివేటు రంగంలో పెట్టుబడులను ఆహ్వానించడం వల్లే పిల్లలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని భావించి, టీఎస్ ఐపాస్ అనే పాలసీని తీసుకొచ్చారు అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

బంగారు తెలంగాణ సాధించడమే కొండాకు అసలైన నివాళి : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 27: అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన బాపూజీ అని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ తొలి ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మంత్రి హరీశ్ రావు అన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీలో సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణ్ బాపూజీ 106వ జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. బాపూజీ నిస్వార్థ సేవలను స్మరించుకొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ సాధించడమే బాపూజీకి అసలైన నివాళి అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ కలలను నెరవేరుస్తూ తక్కువ కాలంలోనే అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి పథంలో సీఎం కేసీఆర్ నడిపిస్తున్నారని పేర్కొన్నారు. సకల జనులు, సబ్బండవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూ జీ ఆశయాలను ప్రభుత్వం నెరవేరుస్తున్నదని పేర్కొన్నారు.

బాపూజీ జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. స్వరాష్ట్రంలో ఉద్యాన విశ్వవిద్యాలయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి గౌరవించుకున్నామని మంత్రి తెలిపారు. చేనేత రంగంలో ప్రతిభావంతులైన కళాకారులకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులను అందజేస్తూ ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని గుర్తు చేశారు.

ప్రభుత్వం వినూత్న పథకాలను అమలుచేస్తూ పద్మశాలీల అభ్యున్నతికి పాటుపడుతున్నదని పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప ప్రజాస్వామికవాది. గాంధీజీ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, అవే విలువలను జీవితాంతం పాటిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ దేశం గర్వించదగ్గ గొప్ప నేత అని కొనియాడారు. అణగారిన వర్గాల హకుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషి చేశారని తెలిపారు.

బహుజన నేతగా దేశవ్యాప్తంగా పద్మశాలీలను సంఘటితం చేసిన ఘనత కొండా లక్ష్మణ్ బాపూజీకే దక్కిందని మంత్రి వెల్లడించారు. త్వరలో అందించనున్న డబుల్ బెడ్ రూం ఇండ్లలో నిరుపేద పద్మశాలీలకు ఇండ్లు ఇస్తామని, సొంత స్థలం ఉన్నవారికి త్వరలోనే ఇళ్లు కట్టుకునేందుకు నిధులిస్తామన్నారు. పద్మశాలీ ఫంక్షన్ హాల్ కు, రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 50 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీని మంత్రి పద్మశాలి సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ కు అందించారు.

జోరువానలో సైతం..

జోరువానలో సైతం గజ్వేల్ పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ మేరకు ముందుగా కెమిస్ట్రీఅండ్ డ్రగిస్ట్ వారి కోసం రూ. 20 లక్షలతో గజ్వేల్ ఏరియా మెడికల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి వాటికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను సభ్యులకు అందజేశారు. ఆ తర్వాత కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించి కుమ్మరి కుల సంఘం అభివృద్ధి కై రూ. 25 లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీ ఆ వర్గ సభ్యులకు అందజేశారు.

అనంతరం హౌసింగ్ బోర్డులో రూ. 50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల కోసం శంకుస్థాపన చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఆవరణలోని అంబేద్కర్ సంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి సంబధిత ప్రొసీడింగ్ కాపీలను ఆ కుల సంఘ సభ్యులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ వేలేటి రోజా శర్మ, ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, గడ ప్రత్యేక అధికారి ముత్యం రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీ అలర్ట్.. 14 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ..

హైదరాబాద్ , సెప్టెంబర్ 27:గులాబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. అయితే సోమవారం సాయంత్రం.. వాతావరణ శాఖ 14 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్,